విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 29 సెప్టెంబరు 2025 8 పేజీలు

అలెర్ట్

- వరద రెండో ప్రమాద హెచ్చరిక
- 6.50 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం
- వరద పరిస్థితులపై సమాచారం ప్రజలకు తెలియజేయండి
- బాపట్ల కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర - కొల్లూరు : మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదికి అధిక నీరు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా, రేపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలోని కొల్లూరు మండలం కృష్ణ నది నీటి ప్రవాహంతో ముంపు ప్రమాదం ఉన్న తోకలవారిపాలెం, పోతర్లంక, గాజుల్లంక, అవులవారిపాలెం పరిధిలో కృష్ణ నది నీటి ప్రవాహంతో ముంపు గ్రామాల్లో ఆర్డీఓ, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులతో కలసి పర్యటించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదికి అధికంగా నీరు రావడం జరుగుతుందని, రెండో వార్నింగ్ మ్రోగిందన్నారు. ఆరు లక్షల 50 వేల క్యూసెక్కుల నీరు రావడం జరిగిందని, ముంపు గ్రామాల్లో ఉన్న ప్రజల అందరిని అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు.కొల్లూరు మండలంలో వరద ప్రవాహంతో ముప్పు ఉన్న గ్రామాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ముంపు గ్రామాలలో ఇప్పటికే 80 శాతం నిత్యావసర వస్తువులు పంపినిచేయడం జరిగిందని తెలిపారు.వరద పరిస్థితుల పై గ్రామస్థులకు పరిస్థితులను ఎప్పటికప్పుడు మిగతా 2 లో ...

భగత్ సింగ్ అడుగుజాడల్లో

విద్యార్థులు నడవాలి

- స్టాఫ్ డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ నినాదంతో ముందుకు
- భారత యువత మేలుకో నీ స్థితిగతి తెలుసుకో
- భగత్ సింగ్ జయంతిలో ఏఐవైఎఫ్ నేతలు

విశాలాంధ్ర - కనిగిరి : అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం కనిగిరిలోని దరిశి చెంచయ్య భవనం నందు భగత్ సింగ్ జయంతి వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రవీంద్రబాబు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ యాసీన్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ మాచపల్లి పూర్ణచంద్ర రాజు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ రాజ్ గురు, సుఖదేవులతో కలిసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భగత్ సింగ్ మిగతా 2 లో ...

టీడీపీలో గ్రూపు రాజకీయాలు

ప్రోత్సహించొద్దు

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-సిఎస్ పురం : టీడీపలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ ముక్క ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు. గ్రామ స్థాయిలో ఐక్యతతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని సిఎస్పురం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక పంచాయతీ కార్యకర్తలు వేరే పంచాయతీలలో జోక్యం చేసుకోవద్దని సూచించారు. గ్రామాలలో గ్రూపు రాజకీయాలు చేయకుండా, ఐక్యమత్యంతో కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో తలెత్తే సమస్యలు ముందుగా గ్రామ పార్టీ అధ్యక్షులకు తెలియజేయాలని, పరిష్కారం కానప్పుడు మండల పార్టీ అధ్యక్షులకు తెలియజేయాలని సూచించారు. పార్టీలో గ్రూపులు ఏర్పాటు చేసి విభేదాలు సృష్టించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలుగు దేశం మిగతా 2 లో ...

గిరిజనులకు అన్యాయం చేస్తే

సహించం

- మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి
- అసెంబ్లీలో పాతినిధ్యం ఉండాలి
- జిపిఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్
- ఒంగోలులో గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశం
- గిరిజన హక్కులు కాలరాస్తే తిరుగుబాటు చేస్తాం.... రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేరిస్తే ఉద్యమిస్తాం
- ఒంగోలు రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంఘ నేతల హెచ్చరిక

విశాలాంధ్ర-ఒంగోలు : మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. ఒంగోలు గిరిజన భవన్‌లో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలోని గిరిజన భవన్ నందు గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్ ఆధ్వర్యంలో వివిధ గిరిజన సంఘాల ముఖ్య నాయకులతో, మేధావులతో, డాక్టర్లతో, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచిన నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు గూడు నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారని అన్నారు. ఆధార్ కార్డు మిగతా 2 లో ...

కర్ణాటక ఆర్టీసీ బస్సును మోటార్ బైక్ ఢీకొని

యువకుడు మృతి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : కర్ణాటక ఆర్టీసీ బస్సు మోటర్ బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు చిత్తూరు జిల్లా మదనపల్లి దగ్గర తంబాలపల్లి గ్రామానికి చెందిన వి యశ్వంత్. 20 సంవత్సరాలు కర్నూల్ నుండి మార్కాపురం వస్తుండగా, అదే సమయంలో శ్రీశైలం నుండి కర్ణాటక వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మార్కాపురంలోని ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెలుసుకున్నా వెంటనే దోర్నాల పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కనిగిరిలో 'మీకోసం'

విశాలాంధ్ర-పీసీపల్లి : కనిగిరి పవిత్ర ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరుగు స్పందన కార్యక్రమాన్ని రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పార్టీ అధ్యక్షులు వేమూరి రామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని భూ సమస్యలు పట్టాదారు పాసుపుస్తకాలు మరేమైనా సమస్యలు ఉంటే అర్జీల ద్వారా స్పందన కార్యక్రమంలో ఇచ్చి పరిష్కరించుకోవాలని తెలియజేశారు.

ప్రోత్సహించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ఎల్లప్పుడూ ప్రజల కోసం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే నరసింహారెడ్డి గుర్తుచేశారు. ఈ పథకాల గురించి గ్రామస్థాయిలో కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కనిగిరి పట్టణంలోని పవిత్ర ఫంక్షన్ హాల్ లో నేడు 10 గంటలకు మీ కోసం (ప్రజా పరిష్కార వేదిక) గ్రీవెన్స్ కార్యక్రమంను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంనకు జిల్లా కలెక్టర్ రాజాబాబు జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని, గ్రామాలలో వివిధ శాఖల ద్వారా పరిష్కరించుటకు ఏర్పాటు చేశారని, సమస్యలను ప్రజలు అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని, ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మాజీ మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, షిఫ్ సొసైటీ జిల్లా అధ్యక్షులు తోడేటి గోపి, సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, టిడిపి నాయకులు యన్ సి మాలకొండయ్య, మన్నేపల్లి కార్తీక్ నాయుడు, బత్తుల వెంకటాద్రి, వెంకటస్వామి, కూటగుళ్ల మహబూబ్ బాషా, అట్లూరి రామకృష్ణంరాజు, కోనంగి వెంకట కొండయ్య, షేక్ రజ్జాబ్ బాషా, షాను తదితరులు పాల్గొన్నారు.

అలెర్ట్

(మొదటిపేజీ తరువాయి)

వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. కృష్ణ నది నీటి ప్రవాహం ప్రాంతాల్లో ఉన్న గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల స్థాయి లో అధికారులతో టైమ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముంపు ప్రాంతంల్లో గ్రామాలలో ఎలాంటి సమస్యలు వస్తాయని ప్రజలను కలెక్టర్ అడిగి తీసుకున్నారు.రోడ్లు,వర్ష కాలంలో పిల్లలు స్కూల్స్‌కు నదిలో గుండా వెళవాల్సివస్తుందని,రోడ్లు, బోట్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌కు తెలియజేశారు. పోతార్లంక, గాజుల్లంక గ్రామంలోని రేషన్ షాప్‌ను పరిశీలించి రేషన్ కార్డులు ఉన్న అందరికి నిత్యవసర వస్తువులు సంక్రాంగా పంపిణీ చేస్తున్నారని డీలర్లును అడిగి తీసుకున్నారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారిణి యన్. రామలక్ష్మి, డిపిఓ.ప్రభాకర్ రావు,మండల తహశీల్దార్, ఎంపిడిఓ. పంచాయతీ సెక్రటరీ, విఆర్ఓ విఆర్ఏ సర్పంచ్‌లు ఉన్నారు.

పచ్చని పంటలతో రైతన్నల హర్షం

విశాలాంధ్ర-దొనకొండ: ఈ ఏడాది తరుచుగా ఏర్పడుతున్న తుఫాన్‌ల ప్రభావంతో మండలంలో మంచి వర్షాలు పడుతున్నాయి. దీంతో రైతుల సాగు చేసిన పంటలు పచ్చగా కళకళలాడుతుండటం చూసిన రైతులు తమ పంటలు జీవం పోసుకున్నాయంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు 400 అడుగుల లోతుకు పడిపోవటంతో కేవలం వర్షాలపైనే ఆధారపడి మెట్ట పంటలైన కంది, ఆముదాలు, పత్తి సాగు చేస్తుంటారు. బోరు ఉండి నీరు వస్తున్న కొద్దిమంది మాత్రమే మిరప సాగులో పెట్టుబడి పెడుతుంటారు. గత ఏడాది తీవ్ర వర్షాభావంతో పండిన కొద్ది మేర పంటలకు గిట్టుబాటు ధరలేక పూర్తి స్థాయిలో నష్టాల భారిన పడిన దుస్థితి నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ కాలానికి రుతు పవనాలు కొంత ఆలస్యంగా వచ్చినప్పటికి, తదుపరి మోస్తారు వానలు పడటంతో బోర్లకు నీరు అందుతున్నాయి. చెరువులు, కుంటలు పశు సంపదకు సరిపడా కొద్దిమేర నీటితో నిండుకున్నాయి. 18 పంచాయతీల్లో 350 ఎకరాల్లో ఆముదాలు, 3500 ఎకరాల్లో కంది, 5 వేల ఎకరాల్లో పత్తి, 1700 ఎకరాల్లో పొగాకు సాగు చేసినట్లు వ్యవసాయాధికారి వి.బాలక్రిష్ణనాయక్ తెలిపారు. ఈ సారైనా పంటలు చేతికి వచ్చిన వేళ ధరల స్థిరీకరణను రాష్ట్ర ప్రభుత్వం చేపడితే అప్పుల ఊబి నుండి బయట పడతామంటూ రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు నడవాలి

(మొదటిపేజీ తరువాయి)

పోరాడారని తెలిపారు. యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతిని జరుపుకోవడం గర్వకారణం అన్నారు. యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని కోరారు. స్టాఫ్ డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ నినాదంతో ఏఐవైఎఫ్ ముందుకు సాగుతుందని తెలియజేశారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు జన్మించిన నేలపై ఇప్పుడు డ్రగ్స్ అనే పెను భూతం వికటతాండవం చేస్తుందని అన్నారు. యువత డ్రగ్స్ మాయలో పడి తమని తాము కోల్పోతూ దేశ రక్షణను మరిచారని అన్నారు. "ఓ భారత యువత మేలుకో నీ స్థితి గతి తెలుసుకో నీ దేశ భవిష్యత్తు మార్చుకో యువకులారా మేల్కొండి భారతదేశపు గడ్డపై జన్మించిన దీరులారా నిద్ర మత్తు వీడండి. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వంటి మహావీరులకు జన్మనిచ్చిన భరతమాత గడ్డపై జన్మించిన భరత మాత ముద్దుబిడ్డలారా రండి కదలండి దిగజారిపోతున్న భారత దేశపు భవిష్యత్తును నిలబెట్టండి. ఎందరో వీరులకు జన్మనిచ్చిన ఈ భరతభూమి గడ్డపై జన్మించిన యువకులకు ఏమైంది నేడు మత్తుకు బానిసలై కర్తవ్యాన్ని మరచి సంచరిస్తున్న యువకులారా ఇకనైనా మేల్కోండి. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి స్పోర్ట్స్ కు దగ్గరగా ఉండాలని ఏఐవైఎఫ్ స్టాప్ డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ నినాదంతో ముందుకు వెళుతుందని యువత ఈ బాటలో నడవాలని యువతను కోరారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 23 సంవత్సరాలు వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప మహనీయుడు భగత్ సింగ్ అని తెలిపారు. విద్యార్థి దశ నుంచి దేశభక్తిని అలవర్చుకొని రాజ్ గురు సుఖదేవ్ లతో కలిసి చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో దేశం కొరకు పోరాడిన మహనీయులు అడుగుజాడల్లో నేడు విద్యార్థి, యువత నడవాలని అన్నారు. పోరాడు చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో ఏఐఎస్ఎఫ్ ముందుకు సాగుతుందని తెలియజేశారు. వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్ లు మాట్లాడుతూ యువత విద్యార్థులు దేశ రక్షణలో ముందుండాలని డ్రగ్స్ కు దూరంగా ఉండి క్రీడ స్ఫూర్తితో యువకులు విద్యార్థులు దేశ రక్షణలో ముందుకు సాగాలని తెలియజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా సుబ్బారావు, పట్టణ కన్వీనర్ నజీముద్దీన్, ఏఐఎస్ఎఫ్ జీవన్ మండల కన్వీనర్ ఇర్ఫాజ్, పట్టణ కన్వీనర్ జీవన్ బాబు, కో కన్వీనర్ గణేష్, షేక్ నాగూర్ వలి, షేక్ మాలిక్, ఏఐటీయూసీ నాయకులు ఖాసింపీరా, హేమంత్, దినేష్, నవదీప్, విజయేంద్ర, అబుజార్, వరుణ్, వసంత్, ప్రమోద్, ప్రదీప్, గౌతమ్, నారాయణ, జితేంద్ర పాల్గొన్నారు.

సహించం

(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పాలాలకు దూరం అవుతున్నారని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా గిరిజన జాతీ అభివృద్ధికి ప్రతి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులను దారి మళ్లించకుండా వినియోగించ బడాలంటే చట్టసభలలో గిరిజనుల తరపున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. అందుకొరకై మన హక్కుల సంరక్షణ కొరకై సంకటితంగా మనమంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ఉద్యమించాలన్నారు. ఎస్టిల్లో ప్రధానంగా సుగాలి, చెంచు, ఎరుకల, యానాది, నక్కల ఇలా అనేక జాతులు ఉన్నారన్నారు వీరందరికీ సరైన సమాన ప్రాతినిధ్యం లేదన్నారు. రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా మన్యం ప్రాంతాలకు పరిమితం చేయటం వలన మైదాన ప్రాంత గిరిజనులకు గత 58 సంవత్సరాలుగా జరగవలసిన అన్యాయం భారీగా జరిగి పోయిందన్నారు. ఇకనైనా మేలుకొని మన హక్కులను కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరాటం చాలా బాధాకరంగా ఉందన్నారు. అభివృద్ధికి నోచక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో గిరిజన ప్రజానీకం జీవిస్తున్నారనే విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశాన్ని తీసుకువస్తే గిరిజన జాతి ఏకమై సంకటితంగా ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయాల్సి వస్తుందన్నారు. 1962 నుండి 67 వరకు చట్టసభలకు నిర్వహించిన ఎన్నికల్లో జిల్లాలను ఒక యూనిట్గా తీసుకొని రిజర్వేషన్ అందించడం వలన మైదాన ప్రాంతాల్లో అప్పటి ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండేది. మైదాన ప్రాంతాల్లో కదిరి, కావలి, మాచర్ల, జగ్గయ్యపేట నాలుగు అసెంబ్లీ స్థానాలకు రిజర్వేషన్ కల్పించి చట్టసభలో ప్రాతినిత్యం వహించారు కానీ 1967లో ప్రభుత్వ పాలన విధానాల్లో జరిగిన మార్పుల వలన జిల్లా యూనిట్ తీసుకోకుండా రాష్ట్ర యూనిట్‌గా తీసుకోవడం వలన ఏజెన్సీ ప్రాంతాలకి మాత్రమే గిరిజన రిజర్వేషన్ నియోజకవర్గం పరిమితమయ్యాయి. గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2026 సంవత్సరంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలో శాసనసభ స్థానాలు 175 నుంచి 225 పెంపునకు కొత్తగా ఏర్పాటు కానున్న ఆ నియోజకవర్గాలలో రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు సామాజికంగా, ఆర్థిక, రాజకీయ ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం లభించేలా మనమందరం పోరాడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. జాతి భవిష్యత్తు కోసం, అభ్యున్నతి కోసం, జాతీ వెలుగు కోసం, ఉద్యమ బాట మొదలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో చేరేలా పోరాడాలన్నారు. అందుకోసం రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లా తిరిగి ఈ చైతన్య యాత్ర పేరుతో ఉద్యమిస్తున్నామన్నారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరం సత్యం, జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్, ఎరుకల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్ మోహన్ కుమార్ ధర్మ, జిపిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు విష్ణు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ హనుమ నాయక్, జై సంతోష్ నాయక్, ఏ శ్రీను నాయక్, వి రాజు నాయక్, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రవీంద్ర నాయక్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుధాకర్ నాయక్, ఆర్ కృష్ణ నాయక్, ఆర్ దస్రు నాయక్, జె హరి నాయక్, ఆర్ అంజి నాయక్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు దుర్గా నాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, జి గణేష్ నాయక్, జైచంద్ర నాయక్, పాములేటి, ప్రసాద్, రమణమ్మ, బండి రూతమ్మ, కాకి రమణమ్మ, దేవరకొండ రమణమ్మ, వెంకట లక్ష్మమ్మ, తదితరులు మేధావులు పాల్గొన్నారు.

పాత మార్కెట్ స్థలం కాపాడుకుందాం

రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు నగరంలోని పాత మార్కెట్ భూమిని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అప్పగించే పాలకుల నిర్ణయాన్ని వామపక్షాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ అంశంపై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నగర కార్యదర్శివర్గ సభ్యులు జీ.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు పాలకవర్గ చర్యలను తీవ్రంగా దునుమాడారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడులక్షల జనాభా, 132 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఒంగోలు కార్పొరేషన్‌కు సంవత్సర ఆదాయం రూ 172 కోట్లకు పైగా ఉందన్నారు. అయినప్పటికీ పాలకులు ప్రజా ఆస్తులను రక్షించే బదులు ప్రైవేటు వ్యక్తుల దోపిడీకి తలవంచుతున్నారని మండిపడ్డారు. పాత మార్కెట్ ప్రభుత్వ స్థలంలో జీ4 అంతస్థుల కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రైవేట్ బిడ్లు ఆహ్వానించడం ప్రజావ్యతిరేక చర్యఅని విమర్శించారు. పాలకవర్గమే ప్రైవేట్ వ్యక్తుల దోపిడీకి తెరలేపడం దుర్మార్గపు చర్యగా ఆరోపించారు. సిపిఐ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని విడనాడి కూటమి పాలకులు భూములు లాగేసుకునే బాటలో పడ్డారని దుయ్యబట్టారు. ఈ ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రజలు ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కొంగర నరసింహం మాట్లాడుతూ చరిత్ర కలిగిన మార్కెట్ స్థలాన్ని ప్రైవేటు వారికి అప్పగించడం సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు.ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు దాసరి సుందరం మాట్లాడుతూ ప్రభుత్వానికి ధనదాహం పట్టిందన్నారు. సహజ వనరులు, భూములు అన్నీ ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల్లోకి వెళ్లేలా సంస్కరణలు చేపట్టారని విమర్శించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు ఏవి. పుల్లారావు మాట్లాడుతూ ప్రజా ఆస్తులను పెట్టుబడిదారులకు తక్కువ ధరకే కట్టబెట్టే పాలకుల విధానాలను ప్రతిఘటించాలని సూచించారు.. నగరాభివృద్ధి కమిటీ నాయకులు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ఖాళీ స్థలాలను వాణిజ్య ప్రయోజనాలకన్నా ప్రజలకు ఉపయోగపడేలా చెరువుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్‌లకు వినియోగించాలి అన్నారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, జి.శేషయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థలాలను కూడా కాజేయాలనే కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఈ భూమిని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టక తప్పదని పిలుపునిచ్చారు. సుపరిపాలన వేదిక నాయకులు సుంకర సాయిబాబు మాట్లాడుతూ ప్రైవేటు ప్రాజెక్టులు కాకుండా, నగరపాలక సంస్థే ఎల్ఐసి వంటి సంస్థల ద్వారా నిధులు సమీకరించి కాంప్లెక్స్ నిర్మించాలి అని సూచించారు. మార్కెట్ స్థలం కాపాడు కునేందుకు నగర ప్రజలను కదిలించి ఐక్య ఉద్యమం చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, నాయకులు బి.వి.రావు, కె.శ్రీనివాసరావు, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, పట్టణాభివృద్ధి కమిటీ నాయకులు టీబీఎస్ రాజు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులు, ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు రూరల్ : నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు పాల్గొన్నారు. డాక్టర్ కోటపాటి చరణ్, సునీత దంపతుల కుమారుడు కుమార్తె నూతన వస్త్రాలంకరణ వేడుకలను ఆదివారం స్థానిక పువ్వాడి ఫంక్షన్ హాల్ జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు, శ్యామల కాశిరెడ్డి చిన్నారులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, పట్టణ అధ్యక్షులు అమీర్ బాబు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర -కనిగిరి : సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు తన కలంతో నిరంతరం కృషిచేసిన వ్యక్తి కవి కోకిల కవి రత్న గాన గాంధర్వ కవి చక్రవర్తి పద్మశ్రీ గుర్రం జాషువా అని దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. గుర్రం జాషువా జయంతి ఆదివారం కనిగిరిలోని ఆర్ అండ్‌బి బంగ్లా వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పట్టిపీడిస్తున్న అసమాన తలపై ఆయన తన కలంతో అలుపెరగని పోరాటం చేశారని గుర్రం జాషువా గబ్బిలం వంటి అనేక పద్యాలను రచించి ప్రజల మధ్య అసమానతలు పోయేందుకు కృషి చేశారని అన్నారు. ప్రస్తుత రాజకీయ పార్టీలు కులాన్ని భుజాన్ని వేసుకొని ఉన్నత వర్గాలకు ఉన్నత కులాలకు పెద్దపీట వేస్తూ అణగారిన వర్గాలను అనిచి వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు పల్లా మాలకొండ రావు, భాస్కర్, కంటు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి, ధైర్యానికి ప్రతీక భగత్ సింగ్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : త్యాగానికి, ధైర్యానికి ప్రతీక భగత్ సింగ్ అని సీపీఐ సీనియర్ నాయకులు టిసిఎచ్ చెన్నయ్య, నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలిట సింహ స్వప్నం. అసమానతలపై ఎగిసిపడ్డ విప్లవ పతాకం ఆనాడు ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలపై భగత్ సింగ్ ప్రభృతులు చేసిన తిరుగుబాటు యావత్ దేశాన్ని ఆకర్షించిందన్నారు. భారతమాత విముక్తి కోసం కేవలం 23 ఏళ్ల వయస్సులోనే నవ్వుతూ ఉరి కొయ్యను ముద్దాడారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ నాయకులు మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రూప్ - 1లో డీఎస్పీ ఉద్యోగం

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండలం మంగళకుంట గ్రామానికి చెందిన పిన్నిక ప్రశ్న తెలంగాణ రాష్ట్ర గ్రూప్ -1 కేడర్‌లో డీఎస్పీగా ఎంపికై

తర్లుపాడు మండలానికి గర్వకారణమయ్యారు. ఐపీఎస్ అధికారి పిన్నిక హరి యాదవ్, కీర్తిశేషులు దివంగత మంగళకుంట సర్పంచ్ పిన్నిక శారద చిన్న కుమార్తె అయిన ప్రశ్న విజయంపై గ్రామస్తులు,ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ప్రధాన మంత్రి మోదీ రాజీనామా చేయాలి

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్

విశాలాంధ్ర-ఒంగోలు : కేంద్ర ఎన్నికల సంఘంతో కుమ్మక్కై ప్రజా మద్దతు లేకుండా కేంద్రంలో ప్రభుత్వ స్థాపించి గద్దెనెక్కిన ప్రధానమంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేసి నైతికతను చాటుకోవాలని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ అన్నారు. జాతీయస్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘం, భారతీయ జనతా పార్టీ కుమ్మక్కై గత ఎన్నికలలో దొడ్డిదారిన ఎన్నికలలో గెలిచిన విధానాన్ని తప్పుపడుతూ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు, పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ప్రజాక్షేత్రంలో "ఓట్ల దొంగ – గద్దె దిగు" అను నినాదంతో ప్రజల మద్దతు కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం, ఒంగోలు నగరంలోని, రెండవ డివిజన్ ముక్తినూతలపాడు, గుడిమల్లపాడు, కేశవరాజు కుంట ప్రాంతాలలో ఒంగోలు రూరల్ అధ్యక్షులు బుజ్జి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ మాట్లాడుతూ గడిచిన లోక్ సభ ఎన్నికలతో పాటు, ఆ తర్వాత జరిగిన పలు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో ప్రజామోదంతో పని లేకుండా అధికారంలోకి వచ్చిందని తెలియజేశారు.

మెరుగైన వైద్యసేవలతో మన్ననలు

స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభంలో 'దామచర్ల'

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక సుందరయ్య భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆదివారం ప్రారంభించారు. హాస్పిటల్స్ లోని పలు బ్లాక్‌లను సందర్శించి అక్కడ కల్పించిన సౌకర్యాల గురించి డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ వైద్య రంగంలో ఎంతో అనుభవం కలిగిన శ్రీనివాసరావు స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. డయాబెటిస్ కేర్ సెంటర్ కూడా ఏర్పాటు చేయడం పట్ల ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని జనార్ధన్ రావు ఆకాంక్షించారు. పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ఇక్కడకు వచ్చే పేషెంట్లకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఐఎంఏ ప్రెసిడెంట్ శివపేతారామయ్య, సెక్రెటరీ జాలాది మణిబాబు, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు, క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, టీడీపీ నగర అధ్యక్షుడు బండారు మదన్, ప్రధాన కార్యదర్శి బొద్దపాటి వెంకట్, నాయకులు మండవ మురళీకృష్ణ, పాలూరి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగిస్తాం

ముప్పవరపు సుచిత్ర

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : దివంగత టిడిపి నేత ముప్పవరపు వీరయ్య చౌదరి ఆశయాలను తాను, తన కుటుంబం కొనసాగిస్తుందని ఆయన సతీమణి ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమ్మనబ్రోలు గ్రామంలో పశు వుల ఆసుపత్రి, చిలక బడి వద్ద ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి యువసేన ఆధ్వర్యంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాలను విజయవాడ హెల్ప్ హాస్పిటల్, శంకర కంటి ఆసుపత్రి, పెద్దకాకాని సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు తాను నిత్యం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వీరయ్య చౌదరి అహర్నిశలు పేదల సంక్షేమం కోసమే పాటుపడ్డారన్నారు. ఆయన స్ఫూర్తితో వీరయ్య యువసేన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షులు తేల మనోజ్ మాట్లాడుతూ భౌతికంగా వీరయ్య చౌదరి దూరమైన తమ హృదయాలలో ఎప్పుడు నిలిచే ఉండాలని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఈ వైద్య శిబిరము నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా . మండల పరిధిలోని నాగులుప్పలపాడు, మాచవరం, రాపర్ల, చవట పాలెం, అమ్మనబ్రోలు, వినోదరాయుని పాలెం, కనపర్తి తదితర గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించు కున్నారు. హెల్ప్ హాస్పిటల్ డాక్టర్ నాగకిరణ్, వారి వైద్య బృందం వారు 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 80 మందికి మెరుగైన వైద్య పరీక్షలు హెల్ప్ హాస్పటల్ నందు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమయ్యే మందులను అందజేయడం జరుగుతుందన్నారు. 435 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 130 మందికి ఆపరేషన్లు అవసరమని వాటిని తమ హాస్పటల్ నందు పూర్తిగా ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి తిరిగి వారిని స్వగ్రామానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ ఈదర వెంకట కృష్ణారావు (నాని), మండల పరిధిలోని ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, నాయకులు, పార్టీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో వీరయ్య చౌదరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రముఖ సామాజిక ఉద్యమ కారులు గుర్రం జాషువా జయంతి వేడుకలు ఆదివారం స్థానిక బీసీ భవన్ లో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆ మహనీయుని చిత్ర పటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పిఎల్పి యాదవ్ మాట్లాడుతూ అంటరాని తనానికి, కుల అస్పృశ్యత నివారణ కోసం పోరాటాలు నిర్వహించి తద్వారా అణు గారిన వర్గాలను మేల్కొలిపిన గొప్ప వ్యక్తి గుర్రం జాషువా అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, నాయి బ్రాహ్మణ వంకేశ్వరం శ్రీనివాస్, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్. పురుషోత్తం, కాటమ రాజు దేవస్థాన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మా గంగరాజు యాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ నక్క శ్రీనివాస్ యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ పిన్నిక చక్రపాణి యాదవ్, కాటంరాజు దేవస్థానం కమిటీ జాయింట్ సెక్రెటరీ బోరిగొర్ల గాలయ్య యాదవ్, ఉపాధ్యక్షులు నాగం వెంకటేష్ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి తోకల ఎల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

కొండయ్యకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కటారు కొండయ్య అనారోగ్యంతో ఉన్నందున ఇటీవల ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి పరామర్శించారు. ఆయన అందించిన రూ.10 వేల ఆర్థిక సహాయంను మండల కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, సర్పంచ్ గొంగటి వెంకట సుబ్బమ్మ చేతులపై ఆదివారం అందజేశారు. రామగిరి హుస్సేన్, కప్పురం హర్షవర్ధనరెడ్డి, కె.ఆదినారాయణ, యం.యోనోబు, పి.వెంకటసుబ్బయ్య, కె.కోటేష్, యం.నాగయ్య, ఆర్.సుబ్బయ్య, యం.రాజశేఖర్ తదితరులున్నారు.

అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో కొలువైన ఈశ్వరీదేవి అమ్మవారు దసరా నవరాత్రుల సందర్భంగా ఆదివారం అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్రమ అర్చకులు మణిశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మహా నైవేద్యాలు సమర్పించి, సామూహిక మంగళ హారతులిచ్చారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. సోమవారం జ్ఞాన సరస్వతిగా దర్శనం ఇవ్వనున్నట్లు ధర్మకర్త భైరవానంద స్వామి తెలిపారు. గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన తాండవ లక్ష్మయ్య, రంగలక్ష్మీ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

ఖాదీ వస్త్రాలు విక్రయించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : భారతీయ జనత పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఒంగోలు కేంద్రంలోని 4వ మండలం, డివిజన్ 37, బూత్ నంబర్ 39లో ఈ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం మీడియా తో మాట్లాడారు. జీఎస్టీ తగ్గించిన అనంతరం మొదటిసారి నిర్వహించిన మన్ కీ బాత్ ఇది అని అన్నారు. అక్టోబర్ 2న ప్రతి ఒక్కరు ఖాదీ వస్త్రాలు కొనాలని మోదీ పిలుపునిచ్చారు అని, దాన్ని అందరం పాటిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్, 38 వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేశ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా నవదిన వేడుకలు

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక సెయింట్ థెరీసా చర్చిలో నవదిన వేడుకలు ఉత్సాహవంతమైన వాతా వరణంలో జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన వేడుకలలో ముఖ్య అతిథిగా ఫాదర్ జాన్ పీటర్ పాల్గొని పరుల సొమ్ము ఆశింపక అనే అంశంపై మాట్లాడుతూ కష్టపడి సంపాదించుకున్న సొమ్ము ఎప్పుడైనా శాశ్వతమని పరుల సొమ్ము పాము వంటిదని అటువంటి సొమ్ముపై ఆశించి సమాజంలో చెడు వ్యక్తులుగా చెడ్డ పేరు తెచ్చు కోవడం వలన కుటుంబ పరువు పోవడంతో పాటు వ్యక్తి గతంగా చిన్న భిన్నమవుతారని అటువంటి ఆలోచనలకు తావు లేకుండా దేవుని పట్ల ప్రేమతో భయ భక్తులతో ఉండాలని తెలియజేశారు. పూజా కార్యక్రమంలో చర్చి ఫాదర్ డిఎస్ పాల్ అసిస్టెంట్ ఫాదర్ హృదయ రాజు, సంఘ పెద్దలు బొంతు ఆనందరావు పాల్గొన్నారు.

నేడు కనిగిరిలోనే 'మీ కోసం'

విశాలాంధ్ర-దొనకొండ: జిల్లా కేంద్రమైన ఒంగోలులో కాకుండా డివిజన్ కేంద్రమైన కనిగిరిలోనే మీ కోసం కార్యక్రమాన్ని ఈ సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబుతో పాటు పలు శాఖల జిల్లా అధి కారులు పాల్గొనే ఈ కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలిపి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కోరారు.

ప్రైవేటు కార్యక్రమంలో సాయి కిరణ్

విశాలాంధ్ర-పామూరు : మీసాల హనుమంతరావు శ్రావణ సంధ్యల కుమార్తె ఉదయ్ చంద్రిక ఓణీల ఫంక్షన్ ఆదివారం కందుకూరు పట్టణంలో వైభవముగా జరిగింది. వైసీపీ నేత వెంకట సాయి కిరణ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాయి భాస్కర్ వైద్యశాల సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-మార్కాపురం : గుంటూరు నగరానికి చెందిన సాయి భాస్కర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ హెల్త్ కార్డు కింద పశ్చిమ ప్రకాశం జిల్లా విశ్రాంత ఉద్యోగులకు అందిస్తున్న వైద్య సేవలు ప్రశంసనీయమని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఐ.బాల సుబ్బారావు అన్నారు. గుంటూరులో ఉన్న సాయి భాస్కర్ వైద్యశాల అధినేత డాక్టర్ బుసిరెడ్డి నరేంద్ర రెడ్డిని తన కుటుంబ సభ్యులతో కలసి డాక్టర్ ఐ.బాల సుబ్బారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుంటి మార్పిడి మరియు మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తూ పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజలకు మానవతా దృక్పథంతో మీరు అందిస్తున్న సేవలు వేల కట్టలేనివని డాక్టర్ సుబ్బారావు అన్నారు. అందుకు స్పందిస్తూ డాక్టర్ బూసిరెడ్డి మాట్లాడుతూ మా వైద్యశాల నుండి విశ్రాంత ఉద్యోగులకు ఎల్లవేళల సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశంలో మెడికల్ క్యాంపు లను నిర్వహిస్తామని డాక్టర్ బుసిరెడ్డి అన్నారు. అలాగే మా హాస్పిటల్ లో ఖచ్చితమైన రిజల్ట్ కొరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోబోటిక్ యంత్రాలను వినియోగిస్తున్నామని కూడా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు.

శనగలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి డిమాండ్
- అక్టోబర్ 6వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : శనగ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని లేదా కింటాకు రూ.3వేలు బోనస్‌గా ఇవ్వాలని ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలు మండలం కరవది గ్రామంలో శనగ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఏపి రైతు సంఘం నాయకులు మండవ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ శనగ ధరలు పతనం అవ్వడానికి కేంద్ర ప్రభుత్వ దిగుమతి విధానాలే కారణమన్నారు. 2017లో దిగుమతి సుంకం 30శాతం ఉందని ఆ తర్వాత కాలంలో దిగుమతి సంఘం 66శాతం పెంచడం జరిగిందని 2024లో దిగుమతి సుంకాని పూర్తిగా ఎత్తివేసిన కారణంగా క్వింటా టాక్ టు శనగలు రూ.పదివేలకు పైగా ఉన్న ధర తగ్గిపోయి ప్రస్తుతం రూ.5,800 ఉందన్నారు. జేజేలు రూ.7,500 నుండి ప్రస్తుతం రూ.5,700 తగ్గిందని అన్నారు. 2004 సంవత్సరంలో 14 లక్షల క్వింటాళ్లు కేంద్రం ఆస్ట్రేలియా, కెనడా నుండి శనగను దిగుమతి చేసుకోవడం జరిగిందని, ఈ కారణంగానే శనగలు క్వింటాకు రూ.3000 నుండి నాలుగు వేల రూపాయలు రూపాయలు ధర తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి సెనగలు పదివేల రూపాయలకు కొనుగోలు చేయాలని లేదా కింటాకు రూ.3000 రూపాయలు రైతులుకు అందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ సంఘం అధ్యక్షులు జయంతి బాబు మాట్లాడుతూ గాట్ సందర్భంగా రైతు సంఘాలు రైతు శ్రేయోభిలాషులు ఈ ఒప్పందం వల్ల రైతాంగానికి భవిష్యత్తులో తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పినప్పటికీ రైతాంగ అభిప్రాయానికి పరిగణలోకి తీసుకోకుండా చేసిన ఒప్పందం కారణంగానే ఈనాడు రైతులకు తీవ్ర నష్టా నికి కారణమైందని పాలకవర్గాలు రైతాంగ ప్రయోజనాల్ని కాపాడాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల దయా దక్షిణాలకు వదిలేయడం దుర్మార్గమని ఆగ్రహం ఈ సమావేశంలోవ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి శనగ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ రైతు నాయకులు పోలవరం సీతారామయ్య, లింగ ఆంజనేయులు, ఎన్.అంజిరెడ్డి, కట్టా పేరయ్య, పెద్దిరెడ్డి అంజిరెడ్డి,మంచు ఆదినారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ కార్యకర్తలకు భరోసా

- వైసీపీ సమన్వయకర్త,రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర - పర్చూరు : స్థానిక వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త,రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అన్యాయానికి గురవుతున్న కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలు,వేధింపులు,కక్షలు,తప్పుడు కేసులకు సమాధానంగా డిజిటల్ బుక్‌ను ప్రారంభించారన్నారు.యాప్ ద్వారా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలను రికార్డ్ చేయవచ్చు, సాక్ష్యంగా నిలుపవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కఠారి అప్పారావు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్,జిల్లా వైస్సార్సీపీ అధికార ప్రతినిధి బండారు ప్రభాకర్,నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొమ్మబోయిన వాసు,రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీ బట్టు అనిల్ కుమార్, ఎర్రం సుబ్బారెడ్డి, కొల్లా వెంకట చౌదరి, ముప్పవల రాంబాబు,ప్రచార విభాగం అధ్యక్షుడు దాసరి వెంకట్రావు,పఠాన్ మస్తాన్ వలి, కంచన పల్లి రమేష్,కొల్లా శ్రీహరి, యద్దనపూడి హరి ప్రసాద్, మల్ల శ్రీనివాసరావు, గాదె సురేష్, మార్టూరు,ఇంకొల్లు మండలాల అధ్యక్షులు జంపని వీరయ్య చౌదరి,చిన్ని పూర్ణ రావు,నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు కుమ్మరి చందు,రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవి, నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు కాటి లక్ష్మణ్,నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూతలపాటి బలరాం,ఐటీ విభాగ అధ్యక్షుడు గర్నెపూడి సన్నీ,ద్రోణాదుల సర్పంచ్ భాగ్యరావు,గొల్లపూడి సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాతకు మంత్రి గొట్టిపాటి పూజలు

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం శ్రీచక్ర సహిత వాసవి కన్యక పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పాలక మండలి సభ్యులు మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ పూజారి మంత్రిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ముడిరాయి తరలింపు

విశాలాంధ్ర - సంతమాగులూరు : కొమ్మాలపాడు గ్రామం నుంచి బల్లికురవ రోడ్డులో నిత్యం గ్రానైట్ ముడిరాయిని లారీలో ప్రమాదకరంగా తరలిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు.బండరాళ్ల తరలింపులో ఎలాంటి భద్రతా నియమాలను పాటించడం లేదని ఆరోపించారు. అలాగే ముడిరాయిని తీసుకుని వచ్చే లారీలు గ్రామంలో నుంచి నామ్ హైవేపై ప్రధాన రహదారిలోని మలుపులు వద్దకు చేరుకోవాల్సి ఉంది.అదే సమయంలో హైవేపై వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలు రాకపోకలకు,ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.బండరాళ్ల లోడుతో వస్తున్న లారీలు టర్నింగ్ తిరగడానికి వ్యయ ప్రయాసపడాల్సిన పరిస్థితి నెలకొంది.అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు,యాజమాన్యాలు స్పందించి ముడి రాయిని అనువైన మరో మార్గంలో తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ సంతమాగులూరు మండల సమితి కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా డిమాండ్ చేశారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

చిరంజీవి యువత వ్యవస్థాపకుడు స్వామి నాయుడు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు అందరూ కృషి చేయాలని చిరంజీవి యువత వ్యవస్థాపకుడు స్వామి నాయుడు అన్నారు.జనసేన పార్టీని బాపట్ల నియోజకవర్గంలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిలభారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు స్వామి నాయుడు పిలుపునిచ్చారు.ఆదివారం ఆయన బాపట్ల జనసేన పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి విచ్చేసిన స్వామి నాయుడిని బాపట్ల జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ సాదరంగా ఆహ్వానించారు.జనసేన నాయకులు, కార్యకర్తలు, చిరంజీవి అభిమానులు హాజరై ఆయనకు దుశ్శాలువాలు కప్పి,పూల బొకేలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి,కత్తి నాగలక్ష్మి,దాసరి ఏసుబాబు,గొట్టిపాటి శ్రీకృష్ణ, విష్ణుమొలకల చంద్రమోహన్ జనసేన నాయకులు,కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పద్మభూషణ్,నవయుగ కవి చక్రవర్తి,విశ్వకవి సమ్రాట్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలను అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.విశ్వనరుడు మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ప్రముఖులతో కలసి మునిసిపల్ ఆఫీస్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రముఖ కవి గుర్రం జాషువా ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ స్థానం గుర్రం జాషువా స్వంతం అన్నారు.సామాజిక ప్రయోజనం కోసం రచనలు చేసాడని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గణపవరం మాజీ సర్పంచ్ కత్తి దానియేలు,నక్క ప్రకాష్,గవిని ప్రసాద్,కర్నెటి ఏడు కొండలు,నర్రా కొండలు, దయరావు,పాపయ్య,శివ జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

లోతట్టు ప్రాంతాల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : లోతట్టు ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,కృష్ణా నదిలో నీటి ప్రభావం వేగంగా పెరుగుతుంది అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో విధులు కేటాయించిన అధికారులు సిబ్బంది సిద్ధంగా ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతంలోని 25 రిహేబిటేషన్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని,రిహేబిటేషన్ కేంద్రాలకు డిఆర్డీపీ పిడి. లవన్న ఇంచార్జిగా ఉన్నారని తెలిపారు.రీహేబిటేషన్ కేంద్రానికి విఆర్ఓ,విఆర్ఏ, అంగన్వాడీ వర్కర్,మహిళా పోలీస్,డిజిటల్ అసిస్టెంట్లు,ఏఎన్ఎంతో టీం వాట్సాప్ గ్రూప్‌లో వరద పరిస్థిని అధికారులకు సిబ్బందికి వెంటనే తెలియజేయాలన్నారు. గామస్తుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోని వరద పరిస్థి తులను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. పరికరాలు సిద్ధంగా ఉండాలని అగ్నిమాపక అధికారిని ఆదేశించారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ప్రపంచ రేబీస్ డే సందర్భంగా చీరాలలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో చీరాల వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిట్టిబాబు రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ తమ పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. టీకాలు వేయించడం ద్వారా జంతువుల నుండి మనుషులకు వ్యాపించే ఈ వ్యాధిని అరికట్టవచ్చన్నారు.వీధి కుక్కలు కరిచినపుడు వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు.కుక్కలు,పెంపుడు జంతువుల విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్

బాపట్ల అధ్యక్షులుగా పఠాన్ అహ్మద్ భాషా

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల నియోజకవర్గం ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం బాపట్ల ఎన్జీవో హోంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రషీద్ దిలీప్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సమావేశంలో బాపట్ల జిల్లా అధ్యక్షులుగా కర్లపాలెంకు చెందిన పఠాన్ అహ్మద్ భాషాని,బాపట్ల జిల్లా సెక్రెటరీగా సయ్యద్ కరిముల్లాని,బాపట్ల నియోజకవర్గం ప్రెసిడెంట్‌గా మహమ్మద్ బాజీ ఖాన్‌ని,సెక్రెటరీగా మహబూబ్ సుభానిని ఎన్నుకోవడం జరిగింది.మిగతా కార్యవర్గ సభ్యులు ఎన్నిక త్వరలో జరుగుతుందని ప్రకటించారు.

మహాచండీగా భక్తులకు దర్శనం

విశాలాంధ్ర - సంతమాగులూరు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాచండీగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు వెంకటేశ్వరరావు, సత్యవరప్రసాద్,శరత్ బాబు,కిరణ్,శంకర్ ఆధ్వర్యంలో దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేసి,సుందరంగా అలంకరించారు. ఏల్చూరులోని పాటిమీద బజార్ దుర్గమ్మ, వాసవిమాత,మిన్నెకల్లులో బాలా త్రిపురసుందరిదేవి,కుందుర్రులో కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మ వారికి కాయకర్పూరం సమర్పించారు.కమిటీ వారు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా గాంధీ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇనగంటి గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.బాపట్ల పట్టణంలోని రైస్ మిల్లర్ అసోసియేషన్ భవన్లో రైస్ మిల్లర్స్ యూనియన్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.రైస్ మిల్లర్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఇనగంటి గాంధీ తెలిపారు.

పిల్లలపై నిఘా పెట్టాలి

- జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : దసరా సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై కచ్చితంగా నిఘా ఉంచాలని తల్లిదండ్రులను హెచ్చరిస్తూ బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదివారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవలి జిల్లాలో ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గ్రామాలు,పట్టణాల శివారులలో ఉన్న చెరువులు,గుంతలు నిండిపోగా, నదులు, వాగులు,కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సెలవుల కారణంగా సరదాగా కాలక్షేపం కోసం పిల్లలు,యువకులు చెరువులు,కాలువలు,వాగులు,నదీతీరాలు, సముద్ర తీరాలకు వెళ్లి ఈతకు దిగే ప్రయత్నాలు చేస్తున్నా రన్నారు. అయితే ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఎక్కువని హెచ్చరించారు.

ఉధృ తంగా ప్రవహించే ప్రవా హాలలో ఈతకు దిగటం వలన ప్రమాదాలకు లోన వుతున్నా రన్నారు. అంతేకాకుండా సరైన లోతు తెలియని చెరువులలో, కుంటలలో దిగి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. బాపట్ల జిల్లా పరిధిలో విశాలమైన సముద్రతీరం ఉండటంతో ముఖ్యంగా సూర్యలంక, వాడరేవు,రామాపురం వంటి సముద్రతీరాలకు యాత్రికులు భారీగా తరలివసు _న్నారని తెలిపారు. యువకులు పోలీసుల హెచ్చరికలను లెక్క చేయకుండా లోతుగా సముద్రంలోకి వెళ్లి, అకస్మాత్తుగా వచ్చే అలల వల్ల ప్రమాదాల్లో పడుతున్న ఘటనలు చోటు చేసుకున్నాయని చెప్పారు. ఈ తరహా ఘటనలను నివారించేందుకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో గమనించి, ఈతకు వెళ్లకుండా అడ్డుకోవాలని, స్నేహితుల ఒత్తిడికి లోనై నీటిలోకి దిగకుండా వారిని చైతన్య పరచాలని తెలిపారు. జిల్లా ప్రజలు, పిల్లలు, యువత పోలీసు శాఖ సూచనలు కచ్చితంగా పాటించాలని,మీ ప్రాణం మీ చేతుల్లోనే ఉందన్న బాధ్యతతో నడవాలని ఎస్పీ తెలిపారు.

పెనుమూడి రేవు వద్ద పెరుగుతున్న వరద

- పల్లెపాలెం కాలనీలో ఇళ్లల్లోకి చేరిన వరద నీరు

విశాలాంధ్ర - రేపల్లె : వరద ఉధృతి పెరిగినందున రేపల్లె మండలం పెనుమూడి కృష్ణ నది పరివాహక ప్రాంత పల్లిపాలెం లోతట్టు ప్రాంతాల ప్రజలను రేపల్లె మండల తహసీల్దార్ సందర్శించి పల్లెపాలెం కాలనీలో నివసిస్తున్న మత్స్యకార కుటుంబాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టారు. మత్స్యకారులు పునరావస కేంద్రానికి తరలిస్తు న్నారు. పెనుమూడి వద్ద వరద ఉధృతిని టిడిపి సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్ రెవెన్యూ పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా సహాయ చర్యలు రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ గ్రామ కార్యదర్శి స్వయంగా దగ్గరుండి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపడుతున్నారు.

అత్యాధునికంగా ఫైబ్రాడ్ ఆపరేషన్

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో శ్రీసాయి మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రిలో ఆదివారం ఫైబ్రాడ్‌కు అధునాతన పరిక రాలతో విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. సుమారు నాలుగు కిలోల బరువు ఉన్న గడ్డను నిపుణులైన వైద్యులు ఎంతో చాకచక్యంగా తొలగించారు. ఎన్నో సంవత్సరాలుగా వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళకు ఈ శస్త్రచికిత్స ద్వారా ఉపశమనం లభించింది. ఈ శ్రస్త్ర చికిత్సలో వైద్యులు డాక్టర్ దెందుకూరి రామభద్రరాజు,డాక్టర్ కృష్ణ,డాక్టర్ గీతికా పాల్గొన్నారు. అదనంగా,రోగుల అవసరాల మేరకు వివిధ వైద్య పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్టు వారు వెల్లడించారు.

గంగపాలెం-ఉప్పుమాగులూరు రోడ్డుపై రాకపోకలకు అంతరాయం

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని గంగపాలెం-ఉప్పుమా గులూరు రోడ్డు వంతెన ఇటీవల భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతింది దీంతో రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడి ఉంది ఇటీవల భారీ వర్షాలతో కురవటం వలన పెద్ద ఎత్తున వర్షపు నీరు రోడ్డుపై నిలిచింది. దీంతో రాకపోకలు ఆగిపోయాయి. మండలంలో కొనిదెన ఉప్పుమాగులూరు పంచాయతీ రాజ్ బీటీ రోడ్డులో గంగపాలెం సమీపంలో నేల వంతెన పూర్తిస్థాయిలో ధ్వంసం అయింది. ఈ వంతెన ఉన్న గోతులలో నీరు నిలబడటంతో రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. ఈ రోడ్డు అధ్వాన స్థితికి చేరిందని కొనిదెన గ్రామం నుండి ఉప్పుమాగులూరు వరకు రోడ్డులో గోతులు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేస్తారని వంతెన ఎత్తుపెంచి రోడ్డును అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

వాడరేవులో అరకు కాఫీ షాపు ప్రారంభం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : అరకు కాఫీ ప్రాముఖ్యతను పెంచే దిశగా ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా చీరాల మండలం వాడరేవు గ్రామ పంచాయతీ పరిధిలో కాఫీ షాప్‌ను చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా ప్రత్యేకమైన అరకు కాఫీకి గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నార 100శాతం ఆర్గానిక్ కాఫీ ఎలాంటి రసాయనాలు లేని సహజసిద్ధమైన ఉత్పత్తి అరకు కాఫీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. లవన్న,చీరాల ఆర్డీవో టీ.చంద్రశేఖర్ నాయుడు,తహశీల్దార్లు కె.గోపీకృష్ణ,గీతారాణి, ఏపిఎంలు మధుసూదనరావు,అంజిబాబు,సిబ్బంది,డీపీఎంలు రవీంద్ర, రవికుమార్,సనిత,మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు,ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్‌రావు,వాడరేవు కూటమి నాయకులు, పాల్గొన్నారు.

సెపక్ తకర జాతీయ జట్టుకు జోత్స్న ఎంపిక

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పొన్నపల్లి గ్రామానికి చెందిన తుమ్మ వెంకట జోత్స్న రాష్ట్రస్థాయి సెపక్ తకరాలో గెలుపొంది జాతీయ జట్టుకు ఎంపికైంది. 27,28 తేదీలలో ఒంగోలు డాక్టర్ పి.ఆనంద్ మినీ స్టేడియంలో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని గెలుపొందడంతో జాతీయ జట్టుకి ఎంపికైంది. అక్టోబర్ నెలలో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆమె పాల్గొంటుందని ఆమె తండ్రి తుమ్మ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జాతీయ జట్టుకు ఎంపికైన జ్యోత్స్నను పలువురు అభినందనలు తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేట్ పరంపై నిరసన

రేపల్లె వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరు గణేష్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ఎన్నో వ్యయ ప్రయాసలతో అన్ని అనుమతులు సాధించి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టిన ఒకే ఒక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని రేపల్లె వైఎస్ఆర్సిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. ఆదివారం గుళ్ళపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీలోని ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రస్తుతం మన రాష్ట్రంలో 12 మెడికల్ కాలేజీలు ఉండగా పేద ప్రజలు వైద్యానికి ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో మరో 17 మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ద్వారా అనుమతులు పొంది వాటిలో ఏడు మెడి కల్ కాలేజీలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభం చేయటం జరిగిందన్నారు. మిగిలిన కళాశాలలను కట్టేందుకు ప్రభుత్వానికి ఇష్టం లేక ఆ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధపడిందన్నారు. దీని ద్వారా బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు

మెడికల్ కాలేజీలో చేరాలన్న కల అందరి ద్రాక్షగానే ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదీన జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం తెలియజేసినందుకు నియోజక వర్గంలోని పార్టీ శ్రేణులు అంతా కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చిత్రాల ఓబేదు,రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి నీలం వీరేంద్ర,నియోజకవర్గ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బెజవాడ జోసెఫ్, రేపల్లె రూరల్ మండలం కన్వీనర్ మేడికొండ అనిల్, చెరుకుపల్లి కన్వీనర్ దిండి వెంకటరామిరెడ్డి,జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు సముద్రాల ప్రభు కిరణ్,ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రమేష్, గంధ్రపాటి సురేష్,ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి నీలం నాంచారయ్య,పార్టీ నాయకులు గుండాల కాంతారావు,సువర్ణ రాజు,బూత్ కన్వీనర్ గాలిమోటు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర - రేపల్లె : చిన్నతనం నుండి అంటరానితన అమానుష నిప్పుల కొలిమిలో మహాకవి గుర్రం జాషువా నిలబడే చదువు కొన సాగించారని ప్రముఖ న్యాయవాది అంబేద్కర్ రిస్ట్ దారం సాంబశివరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని హంస జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో జూలకంటి బుజ్జిబాబు అధ్యక్షతన మహాకవి గుర్రం జాషువా130వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గుర్రం జాషువా ప్రతిభ అవార్డులకు ఎంపికైన పదవ తరగతి విద్యార్థిని గుంటూరు కవితకు రూ. 5 వేలు నగదు బహుమతి అందజేశారు. రచయితలకు,వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బౌద్ధ రచయిత గోవర్ధన్,గుంటూరు రెడ్డయ్య,హంస కాలేజ్ డైరెక్టర్ సత్యనారాయణ,రిటైర్డ్ ఎంఈఓ భూపతి ధర్మారావు,విజ్ఞాన్ ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహమ్మద్ సాజిద్ భాష,అంబేద్కర్ రిస్ట్ దర్శి భాస్కరరావు,ఎస్.ఎస్ యోగా గురువు గాలి సురేష్,న్యాయవాది మునిపల్లి సుబ్బయ్య,పట్టణ జనసేన అధ్యక్షుడు మహేష్,గుర్రం జాషువా అభిమానులు,రచయితలు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవ స్వచ్ఛ ఉత్సవ్‌లో ఆటో డ్రైవర్లు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని క్లీన్ అండ్ గ్రీన్‌గా మారాలంటే స్వచ్ఛతను సామాజిక ఉద్య మంగా భావించి,ప్రతిఒక్కరూ బాధ్యతతో మెలగాలని,దీనికి మేము సైతం భాగస్వాములము అవుతామని పట్టణ ఆటో డ్రైవర్లు ముందుకు వచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతా హి సేవ,స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆటో డ్రైవర్లు,తమ ఆటో లతో ర్యాలీ నిర్వహించారు. ఆటో డ్రైవర్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులతో పాటు,మునిసిపల్ శానిటరి ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు,శానిటేషన్ సెక్రటరీ యన్.సురేంద్ర కుమార్, మేస్త్రీలు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర - చీరాల : మాన్యశ్రీ కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా అక్టోబర్ 9న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన ధర్నా నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ప్రకటించింది. .చీరాల గడియారాస్తంభం వద్ద మాన్యశ్రీ కాన్షీరామ్ విగ్రహం సమక్షంలో ఈ నిరసన ధర్నా కరపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు కాటి మార్క్ ఆధ్వర్యంలో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు దుడ్డు భాస్కరరావు,గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 9న విజయవాడలో జరిగే నిరసనలో చీరాల నుండి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, కవులు,కళాకారులు, విద్యార్థులు,సానుభూతిపరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పౌలు,కుంచాల పుల్లయ్య,వంశి, చంటి,మహేంద్ర,బుజిబాబు,డేవిడ్,లాజరు,సుధాకర్, అరుణ్,అర్జున్‌రావు,బాబురావు,శ్రీను పాల్గొన్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న శివప్రసాద్

విశాలాంధ్ర - నిజాంపట్నం : దసరా దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు సందర్భంగా మండల కేంద్రమైన నిజాంపట్నంలోని గోకుల్ నగర్‌లో జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో అలాగే జల్సా బజార్‌లో టీడీపీ నాయ కులు కేసన రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏడవ రోజు ఆదివారం అమ్మవారిని శ్రీమహా చండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రేపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము,టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు,లుక్కా గుడారంకయ్య, కుమార స్వామి, మాజీ ఎంపీపీ నర్రా నాగమణి, నిజాం పట్నం పీఏసీఎస్ అధ్య క్షులు నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర-ఒంగోలు: జిల్లా వ్యాప్తంగా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో పేకాట, కోడి పందాలు, మట్కా స్థావరాలతోపాటు, బైక్ రైసులపై స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ జిల్లా పోలీసులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అయా పోలీసు స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాలతో పేకాట శిబిరాల పై పోలీసులు జల్లెడ పట్టారు. కొండ ప్రాంతాలతో పాటు పోలాలలో, రహస్య ప్రాంతాలలో పేకాట రాయుళ్ళను డ్రోన్ కెమెరాలను వినియోగించి పట్టుకున్నారు. 16 ప్రదేశాలలో దాడులు నిర్వహించి, 80 మంది పేకాట రాయుళ్ళు ను అరెస్ట్ చేశారు. వారి నుండి రూ. 1,35,800 రూపాయలను సీజ్ చేశారు. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో -2, చీమకుర్తి -1, మద్దిపాడు- 1, పొదిలి - 1, తర్లుపాడు - 1, త్రిపురాంతకం -1, కొండేపి -1, గిద్దలూరు -1 , రాచర్ల-1, కొమరోలు-1 కంభం-2, అర్ధవీడు-1,వై పాలెం-2 స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నట్లు గుర్తించిన పోలీస్ బృందం అనుమానిత ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో మెరుపు దాడి చేశారు. అసాంఘిక కార్యకలాపాలు ఎవరు నిర్వహించినా... ఎంతటి వారైన ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టవద్దని ఎస్పీ పోలీసులను ఆదేశించారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 74 కేసులను నమోదు చేయడమైనది. మద్యం సేవించి వాహనాలను నడిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో 15 మంది పై కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాలలో మద్యపానం మరియు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేన అలాంటి వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో నేర నియంత్రణ మరింత సమర్థంగా నిర్వహించగలమని పోలీసు వారు మనవి చేయడమైనది. ప్రజల కళ్లముందు ఏదైన నేరం జరుగుతున్నట్లు మీ కనిపించిన... మీకు సమాచారం వచ్చిన పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రజలకు జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు మీకు సమాచారం తెలిస్తే, వెంటనే డయల్ 112 నంబర్కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలకు పోలీసు వారు విజ్ఞప్తి చేయడమైనది. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వధూవరులను ఆశీర్వదించిన బూచేపల్లి వెంకాయమ్మ

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన వైయస్సార్సిపి సీనియర్ నాయకుడు మేదం నాగిరెడ్డి, సుబ్బరత్నమ్మ కుమార్తె వధువు గాయత్రి, వరుడు కిషోర్ రెడ్డిల నిశ్చయ తాంబూలాల కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై నూతన వధూవరుడులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు చింతా శ్రీనివాస్ రెడ్డి, జడ్పిటిసి టి రత్నం రాజు, అద్దంకి వైసిపి నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి సూది దేవర అంజయ్య, వైసిపి దర్శి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు బం కా నాగిరెడ్డి, శ్రీరామ్ డైరీ ఎండి మేదం గోపాల్ రెడ్డి, సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏ వెంకట రమణారెడ్డి , తాళ్లూరు మాజీ జెడ్పిటిసి లోకి రెడ్డి వెంకటేశ్వర్ల రెడ్డి, తూర్పు కంభంపాడు సర్పంచ్ గోరంట్ల రాంబాబు, మాజీ సర్పంచి గొంది వెంకట అప్పారెడ్డి, మాజీ సైనికుడు పాలడుగు చిరంజీవి, బోడపాటి అశోక్ కుమార్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-అర్ధవీడు : అర్ధవీడు మండలంలోని నాగులవరం గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠాలు నేర్పించిన గురువులకు పాదాభి వందనాలు అంటూ 2002- 2003 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని నాగులవరం గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం నందు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓ సత్యనారాయణ మరియు పుల్లారెడ్డి. గురువుల ఆధ్వర్యంలో 2002- 2003 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు గురువులను సన్మానించారు. అనంతరం పాఠశాలకు 15 వేల రూపాయల సామాగ్రిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయులకు అందజేశారు. ఉపాధ్యాయులు మూర్తి రెడ్డి. భాస్కర్ ఆచారి. ఎస్ పుల్లారెడ్డి. నెమలి రెడ్డి. శ్రీను. వ్యాయామ ఉపాధ్యాయులు సాయి రెడ్డి. పద్మావతి. విద్యార్థులు ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండలంలోని కేతగుడిపి శివారులలో రహస్యంగా జూదం ఆడుతున్న ఐదు మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు తర్లుపాడు ఎస్సై బి బ్రహ్మనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై బ్రహ్మనాయుడు మాట్లాడుతూ అరెస్ట్ చేసిన వారి వద్ద నుండి 1670 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని,కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల కేంద్రంలోని సి ఎస్ పురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో వి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులను అందుకున్న జె భారతి, జి వెంకటేశ్వర్లును మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారి సేవలు సమాజానికి ఎంతో గౌరవమని అన్నారు విద్యార్థుల మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ఉపాధ్యాయులు తమ సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి, ఎంపీపీ మూడమంచి వెంకటేశ్వర్లు, జెడ్పిటిసి మేకల శ్రీనివాసులు, ఎంఈఓ లు జె ప్రసాద్ రావు, రాజాల కొండారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం

విశాలాంధ్ర-మద్దిపాడు : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని సిడిపిఓ ఆర్ ఇవాంజెలియన్ తెలిపారు శనివారం భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడు గుండ్లపాడు దొడ్డవరం, రాచవారిపాలెం సచివాలయంలలో తల్లుల సమావేశం నిర్వహించారు. తల్లులకు బిడ్డల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంనకు ఏడుగుండ్ల పాడు వైస్ సర్పంచ్ రాజేశ్వరి మేదూరి మహిళా పోలీస్ లు ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు పెద్ద ఎత్తున తల్లులు పాల్గొన్నారు. అధ్యక్షత వహించినవారు జి జ్యోతి జి పద్మావతి కే శివ నాగలక్ష్మి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

విశ్వనరుడు గుర్రం జాషువా

విశాలాంధ్ర-ఒంగోలు: స్థానిక జిల్లా గ్రంథాలయం ఆవరణలో "శ్రీ నాగినేని సంసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్" వారి ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి,విశ్వకవి, కవికోకిల గుర్రం జాషువా 130 వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం సంస్థ అధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు నిర్వహణలో కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ గుర్రం జాషువా తెలుగు సాహితీ పూతోటలో విర బూసిన సాహితీ సుగంధ పుష్పమని, ఆయన పేరు వింటేనే మల్లెలు సుగంధ పరిమళాల్ని వెదజల్లుతాయని, ఆయన కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడ్డ మహాకవియని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ సంఘ సంస్కరణే ఆయన కావ్య లక్షణాలని,లివర్గ సంఘర్షణ, ఆర్థిక ఉద్దేశాలు, దోపిడి వర్గాల పై తిరుగుబాటు చేసిన అభ్యుదయవాదియని ప్రశంసించారు. జిల్లా గ్రంథాలయ ఇన్చార్జి ఉప గ్రంథపాలకురాలుశ్రీమతి సంపూర్ణ కాళహస్తి,శ్రీమతి సింహాద్రి జ్యోతిర్మయి,పిన్ని వెంకటేశ్వర్లు,పి. భాస్కర్, యు.వి. రత్నం, ఆపరేటర్ వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, మెడబలిమి సాంబశివరావు,పాలేటి బాబూరావు,మిట్నసల శాంతారావు,కోప్పోలు వెంకటేశ్వర్లు,కె. ప్రేమకుమార్,వాకా సంజీవ రెడ్డి, దార్ల నారాయణ,బీరం అరుణ ఒరుగంటి ప్రసాద్,టి.కృష్ణారెడ్డి, చెన్నయ్య, అంబటి కొండయ్య, మొగిలి దేవ ప్రసాద్, కందుల మధుతదితరులు పాల్గొన్నారు . సభలో ముందు ఇటీవల మరణించిన హార్మోనిస్ట్ షేక్ సుభానికి నివాళులర్పించారు.

కనిగిరి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే తమ ధ్యేయంగా కృషి చేయడం జరుగుచున్నదని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు. మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో నూతనంగా ఎన్నికైన మండల టీడీపీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షులు ఉప్పలపాటి హరిబాబు లకు ఆత్మీయ సన్మానం ఆదివారం ఘనంగా జరిగింది. మండలం తెలుగు తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, గోళ్ళ వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారముతో కనిగిరి నియోజకవర్గానికి భారీగా నిధులు తెచ్చి అన్ని విధాల అభివృద్ధికి శక్తి వంచన కృషి చేయడం జరుగుచున్నదన్నారు. పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా యువ నాయకత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు పువ్వాడ వెంకటేశ్వర్లు, వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అదుసుమల్లి ప్రభాకర్, మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథరామయ్య, మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ సుంచు కొండయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షులు గద్దె గంగయ్య చౌదరి, గోళ్ళ వీరబాబు, ఏలూరి మాధవరావు, ఏలూరి నరసింహారావు, గద్దె మోహన్, మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను ఉధృతం చేయాలి

విశాలాంధ్ర -ఒంగోలు: సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరిచి సంఘానికి మంచి పేరు తేవాలని ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఒంగోలులోని అతిధి ఫంక్షన్ హాలులో ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం మహాజన సభ ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన మండవ మురళీకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం స్థాపించిన పది నెలల కాలంలోనే అనేక కార్యక్రమాలు చేపట్టి, అందరి మన్ననలు పొందిందని, వినూత్నంగా వన్ కే డోనర్స్ క్లబ్ ద్వారా ఆర్థిక వనరులను సమీకరించి, పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం సహాయ సహకారాలు అందిస్తున్నామని, వైద్యానికి ఆసరాగా నిలబడటమే కాకుండా, పేదలకు స్వయం ఉపాధి పదోన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న కమ్మవారు వన్ కే డోనర్స్ క్లబ్ లో చేరి సంఘ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ సంగం వేగంగా ప్రజాసేవలో దూసుకుపోతుందని, వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. దీని వెనక మండవ మురళీకృష్ణ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమానికి ముందుగా సంఘ ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను మహాజన సభ ముందు ఉంచారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు చిడిపోతు వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ రఘుపతిరావు, 1కే డోనర్స్ క్లబ్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై స్కూటీలు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం అద్దంకిలో పర్యటించారు.మున్సిపల్ కార్యాలయంలో ఏపీ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో 35 మంది దివ్యాంగులకు ఉచితంగాట్రై స్కూటీలు పంపిణీ చేశారు.కమిషనర్ రవీంద్ర,స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు,కూటమి నేతలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండలంలోని కొండుబోట్లపాలెం జిల్లా పరిషత్ స్కూల్‌లో 1993 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం అయ్యారు.1992-1993 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశంను పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.అదే బ్యాచ్‌కి చెందిన మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు సభా అధ్యక్షులుగా వ్యాహరించారు.1993 సంవత్సరంలో పని చేసిన పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి సత్కారాలు ఏర్పాటు చేశారు.1993 టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థిని విద్యార్థులు వారి ఆత్మీయ కలయిక సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎమ్ సుభానికి గడ్డి కోత మిషన్ అందించారు. పూర్వ ఉపాధ్యాయుల్లో హెడ్ మాస్టారు పేరయ్య,ఉయ్యూరు వెంకటేశ్వరరావు,పున్నారావు మాస్టారు, రామచంద్రరావు మాస్టారు,నిర్మలా కుమారి, పరమేశ్వరి,అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రజనీ,అరుణా కుమారి,పూర్వ విద్యార్థులు కొండుబోట్ల పాలెం, నందిరాజుతోట,నల్లమోతువారిపాలెం, హైదరపేట, సమ్మెటవారిపాలెం, పిన్నిబోయినవారిపాలెం గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవ వీర కిశోరం భగత్ సింగ్

విశాలాంధ్ర - బాపట్ల : పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసి భగత్ సింగ్ అమరుడయ్యారని ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అన్నారు.భగత్ సింగ్ 118 వ జయంతి సందర్భంగా ఆదివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ పౌరుషానికి ప్రతీక,ప్రజలలో తిరుగుబాటు స్పృహను కలిగించారన్నారు.ఆయన రుణం భారతదేశం ఎన్నటికీ తీర్చుకోలేనిదన్నారు. విప్లవ మార్గాన్ని ఎంచుకొని,అలుపెరగని పోరాటం చేశారన్నారు.ఆయన దేశభక్తి అజరామరమైనదన్నారు.ఆయన సమ సమాజాన్ని కాంక్షించారన్నారు.మత ప్రమేయం లేని దేశం కోసం కలలు కన్నారన్నారు.ఆయన ఆలోచనల నుండి మనమంతా ప్రేరణ పొందాలన్నారు.భారతదేశ బంగారు భవిష్యత్తు దార్శనికుడు భగత్ సింగ్ అని కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జీవీ బ్రహ్మం,న్యాయవాది జమ్రుడ్ బాషా,ఘంటసాల వెంకటేశ్వర రెడ్డి,ఘంటసాల సినీ నిర్మాత రామారావు,పల్లపోలు లోహియా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బడుగు శ్రీనివాస్,గుడివాడ అమరనాథ్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు దసరా కానుకగా కరువు భత్యం(డిఏ)ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ సంయుక్తంగా ప్రభుత్వాన్ని కోరారు.స్థానిక బాపట్ల జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో 2024 నుంచి ఇప్పటీ వరకు 4 డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని,పీఆర్సీ బకాయిలు,డిఏ, సరెండర్ లీవ్ బకాయిలు,పిఎఫ్ ఏపీజిఎల్ఐసి లోన్లు మెడికల్ రీయాంబర్స్‌మెంట్ బిల్స్ బకాయిలు దాదాపు రూ.25 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు.ఆ బకాయిల విడుదలకు ప్రభుత్వం చొరవ చూపాలని అసెంబ్లీ సమావేశాల చివరి రోజు ప్రస్తుత మాజీ ఎమ్మెల్యేలకు పింఛను వైద్య సదుపాయాలు మెరుగుపరచాలన్నారు.అసెంబ్లీ కమిటీ సిఫార్సు చేసిందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం కల్పించమంటే, వైద్య సదుపాయాలు కల్పించమంటే మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగాలేదని కుంటి సాకులు చెబుతుందన్నారు.డిఎస్సీ నియామకాల ద్వారా కొత్త ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తున్నందున ఎం.టి.ఎస్ ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలకు సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యాయువాణి కన్వీనర్ పీవీ నాగరాజు మాట్లాడుతూ 12వ పీర్సీ కమిషనర్ నియామకం ఆలస్యం అవుతున్నందున తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూర్ భాషా సుభాని మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణత కావాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు,రాష్ట్ర కౌన్సిలర్ జి.ఉదయశంకర్,సిహెచ్ నరసింహారావు,గవిని శ్రీనివాస్,పి. శివాంజనేయులు,ఏవి నారాయణ,తోట శివయ్య,కోటేశ్వరరావు,నారాయణమూర్తి ,ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

గుళ్ళపల్లిలో యజ్ఞ హాస్పిటల్ వైద్య శిబిరం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మండలంలోని గుళ్ళపల్లి గ్రామంలో యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో పరిసర ప్రాంతాల నుంచి 200 మందికి పైగా రోగులు హాజరై వైద్యులను సంప్రదించారు.నిపుణులైన గుండె వైద్య నిపుణుడు డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ బొల్లంకొండ,స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ మాధవి బొల్లంకొండ,ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ సి.పవన్ కుమార్ రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన చికిత్సా సూచనలు అందించారు.రోగులకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు, మందులు కూడా పూర్తిగా ఉచితంగా అందించడం శిబిరం విశేష ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా రేపల్లె నియోజకవర్గ టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ ప్రత్యేక అతిథిగా హాజరై,యజ్ఞ హాస్పిటల్ వైద్యులు ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందించారు.

ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు అమూల్యమైనవి,యజ్ఞ హాస్పిటల్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. హాస్పిటల్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సులభంగా,నాణ్యమైన వైద్యసేవలు అందించడమే తమ ప్రధాన ధ్యేయమని, భవిష్యత్తులో మరిన్ని శిబిరాలను నిర్వహించి ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని ఎస్ఎస్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదర్శ డిగ్రీ కాలేజ్ క్యాంపస్‌లో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్‌లో భాగంగా నిరుద్యోగులకు డిగ్రీ చదువుతున్న యువతీ యువకులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్న సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమాన్ని సైబర్ ఇండస్ట్రీ నిపుణులు అయిన జేబీ షేక్ పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ ఉచిత ప్రవేశ కార్యక్రమానికి నిరుద్యోగులు,డిగ్రీ విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి,దీనివలన కలిగే ప్రయోజనాలు,తీర ప్రాంత ప్రజలకు ఎక్కడికో దూరంగా వెళ్లి నేర్చుకోవలసిన అవసరం లేకుండా దగ్గర్లోని ఎస్ఎస్ ఎడ్యుకేషన్ అకాడమీలో మనకు అన్ని అవకాశాలు ఉన్నాయని ఎస్ఎస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దాసు విద్యార్థులకు తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్ సింగ్,జాషువాలకు నివాళి

విశాలాంధ్ర - సంతమాగులూరు : సీపీఐ సంతమాగులూరు మండల సమితి ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా, విప్లవకారుడు భగత్ సింగ్ జయంతిని పుట్టావారి పాలెంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జాషువా,భగత్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ నేత షేక్ ముస్తఫా, సీపీఐ నేతలు మల్లెల ఏసోబు, మాదాల యల్లమందయ్య,వీరయ్య పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో...

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఆధునిక కవులలో అగ్రస్థానం,సమకాలీన అంశాల మేళవించి రచనలు చేయడంలో అగ్రగన్యుడిగా నిలిచిన కవి కోకిల గుర్రం జాషువా కవితా ఝరి అజరామరం అని సంతమాగులూరు మండల ఎంఈఓ వేమవరపు కోటేశ్వరరావు కొనియాడారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అతిథులుగా నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కాకాని సుధాకర్,సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ హాజరయ్యారు.ముందుగా జాషువా,భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు కార్యక్రమంలో సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరరావు,మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు,మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురుబ్రహ్మం,, సీనియర్ జర్నలిస్ట్ బలుపునూరి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- **గ్రంథాలయంలో** : సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో కవి దిగ్గజం గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన జాషువా చిత్రపటానికి పూలువేసి నివాళులు అర్పించారు.

నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ డాక్టర్ వి.వినోదకుమార్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్‌లో ప్రజల అందజేసిన సమస్యల అర్జీలపై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని,ఆతర్వాత 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని, Meekosam.ap.gov.in లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు.